ప్రజాశక్తి
బుధవారం 8 అక్టోబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



ఒంగోలులోని సాగర్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

ప్రజాస్వామ్య విలువలపై దాడి

సిజెపై దాడి ఘటనపై ప్రజా సంఘాల ఆగ్రహం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి ఘటన దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేపుతోంది. ఈ ఘటనను ప్రజాస్వామ్య విలువలపై, రాజ్యాంగ స్ఫూర్తిపై దాడిగా మంగళవారం నాడు ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో పలువురు వక్తలు స్పందించారు. భారత హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడం అంటే అది వ్యక్తిగత దాడి మాత్రమే కాదు, దేశ ప్రజాస్వామ్యంపై, లౌకికవాదంపై దాడి చేసినట్టేనని విమర్శించారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ దళిత న్యాయమూర్తి అయిన గవాయ్‌పై దాడి జరగడం భారత రాజ్యాంగ స్ఫూర్తిని అవమానపరిచినట్టేనన్నారు. ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడాల్సిన ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడం భద్రతా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమన్నారు. పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ జస్టిస్ గవాయ్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో ఏపీ హేతువాద సంఘం అధ్యక్షులు ఎం.కె. బేగ్, సామాజిక 2లో

ఒంగోలు-కర్నూలు రహదారికి

మోక్షం ఎప్పుడో..?

- తూర్పు, పశ్చిమ ప్రాంతాలకు ఈ రోడ్డే కీలకం
- చీమకుర్తిలో మోకాళ్ల లోతులో గుంతలు
- క్వారీల నడుమ దుమ్ము, ధూళిలో నరకంగా మారిన ప్రయాణం

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఎన్ని ప్రభుత్వాలు మారినా ఒంగోలు-కర్నూలు రోడ్డుకు మోక్షం కలుగడంలేదు. జిల్లాలోని తూర్పు పశ్చిమ ప్రాంతాలకు కీలకమైన ఈ రోడ్డు విస్తరణపై తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోంది. పశ్చిమ ప్రాంతం నుంచి ఐదు నియోకవర్గాల ప్రజాప్రతినిధులు జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి ఇదే మార్గం. జిల్లా కేంద్రం నుంచీ మంత్రితో సహా కలెక్టర్ మొదలు ఎంపీలు, ఎమ్మెల్యేలూ, జిల్లా అధికారులు అందరూ పశ్చిమ ప్రాంతానికి ఈ రోడ్డు నుంచే వెళ్లాలి. మార్కాపురం గిద్దలూరు, కనిగిరి, వైపాలెం నియోజకవర్గాలకు వెళ్లాలంటే ఒంగోలు-కర్నూలు రోడ్డులో వెళ్లాలి. రాయలసీమ జిల్లాలకు కూడా ఇదే ప్రధాన రహదారి. ఇంతటి ప్రాధాన్యత గల కర్నూలు-ఒంగోలు రహదారిపై ఎందుకోగానీ జిల్లా నేతలకు పట్టడంలేదు. దీన్ని బాగుచేయాలనే ఆలోచన కూడా ఎవరికీ రావడంలేదు. ఏ వేదికపైనా దీనిపై చర్చ సాగడంలేదు. గతపదేళ్లుగా దీనిపై చర్చ సాగుతోంది. అప్పటి ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కూడా ఒంగోలు-బేస్తవారిపేట మధ్య నాలుగులైన్లకు విస్తరణ చేపట్టాలని ఢిల్లీలోని మంత్రులకు విన్నపించారు. తర్వాత ఎంపీ మాగుంట కూడా ఈ విషయం కేంద్ర పెద్దల దృష్టికి తీసుకుపోయారు. సరైన ప్రతిపాదనలు లేవు. రోడ్డు విస్తరణ ఇప్పటికీ ఎండమావిగానే మారింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని కొన్ని రోడ్లను బిఓటీ పద్దతిలో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఒంగోలు-కర్నూలు రహదారిని కూడా చేర్చారు. అధ్యయనం కోసం ఓ సంస్థకు అప్పగించారు. నెలల తరబడి అధ్యయనం కొనసాగుతోంది. పనులు ఎప్పుడుచేపడతారనేదీ స్పష్టత లేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటింది. రెండో ఏడాది గడుస్తోంది. గతంలోవైసిపి 2లో



భారీ వాహనాల ధాటికి లేచిన దుమ్ము



బ్రిడ్జిపై పడిన గుంతలు



గుంతల్లో వాన నీటితో వాహనదారుల ఇక్కట్లు

భూగర్భజలాలు పెరిగేలా చర్యలు : కలెక్టర్

అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో భూగర్భజల మట్టం మరింత పెరిగేలా గ్రామ స్థాయిలో నీటి నిర్వహణ ప్రణాళికతో పాటు వాటర్ డిమాండ్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో కలెక్టర్ రాజాబాబు భూగర్భ, జల వనరుల శాఖ, డ్వామా, మైక్రో ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యాన శాఖ, ఆర్ డబ్ల్యుఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకొని 20 మీటర్ల కంటే ఎక్కువ భూగర్భ జల మట్టం ఉన్న గ్రామాలు, 8 నుండి 20 మీటర్ల భూగర్భ జల మట్టం ఉన్న గ్రామాల్లో ఏ ఏ చర్యలు చేపడితే జల మట్టం పెరిగే అవకాశం ఉంటుందో పరిశీలన చేయాలన్నారు. అందుకు అనుగుణం నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 799 ఇరిగేషన్ ట్యాంక్‌లు, సంబంధిత ఫీడర్ ఛానెల్స్‌లో ఉపాధి హామీ పథకం నిధులను అనుసంధానిస్తూ పూడికతీత పనులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకనుగుణంగా నివేదిక రూపొందించాలని కలెక్టర్, ఇరిగేషన్, డ్వామా అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పనిచేసి వాటర్ సోర్స్, వాటర్ డిమాండ్ పై సమగ్రంగా అధ్యయనం చేసి ప్రజలకు అవసరమైన తాగు నీరు అందించేలా గ్రామాల వారీగా ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్, అధికారులను ఆదేశించారు. వాటర్ మేనేజ్‌మెంట్ పై సంబంధిత శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు.సమావేశంలో జల వనరుల శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఎస్ఈ లు వరలక్ష్మి, బాల శంకర రావు, జిల్లా పరిషత్ సిఈఒ బి.చిరంజీవి, గ్రౌండ్ వాటర్ శాఖ డిడి వందనం, డీపీవో ఎం.వెంకటేశ్వర రావు, ఉద్యాన శాఖ అధికారి వై.గోపీచంద్, ఎపిఎంఐపి పీడీ శ్రీనివాస రావు, పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

విశ్లేషకుడు చౌటూరి వెంకటేశ్వర్లు, హేతువాద సంఘం రాష్ట్ర నాయకులు ఎస్.వి. రంగారెడ్డి, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులోని సాగర్ హోటల్ సెంటర్లో మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాలు ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జస్టిస్ గవాయిపై దాడి వ్యక్తిగతం కాదని, అది భారత ప్రజాస్వామ్యం, లౌకికతపై దాడేనని విమర్శించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థ ఇచ్చిన ప్రజానుకూల తీర్పులను సనాతనవాద శక్తులు జీర్ణించుకోలేక ఇలాంటి పాశవిక చర్యలకు దిగుతున్నాయని దునుమాడారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య మాట్లాడుతూ బీజేపీ పాలనలో దళితులు, మైనారిటీలు, మహిళలపై దాడులు పెరిగాయని విమర్శించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.ఎఫ్. బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి మాట్లాడుతూ జస్టిస్ గవాయి పై దాడి దేశ ప్రజలు సిగ్గుతో తలదించుకోవాల్సిన ఘటన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జీవి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, జి.రమేష్, పి.కల్పన, టి.మహేష్, తంబి శ్రీనివాసులు, నెరుసుల వెంకటేశ్వర్లు, జాలా అంజయ్య, ఉబ్బా వెంకటేశ్వర్లు, వి.మోజస్, ఎస్డి హుస్సేన్, యం.శేషయ్య, సిహెచ్ రాంబాబు, బి.వి.రావు, చిరంజీవి, టి.భక్త సింగ్ రాజు, జి.ఆదిలక్ష్మి, బి.రాజ్యలక్ష్మి, ఎం.మాలతి, డి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు-కర్నూలు రహదారికి మోక్షం ఎప్పుడో..?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ హయాంలోనూ దీనిపై చర్చ నడిచినా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. అంతకు ముందు జిల్లాకు చెందిన శిద్దారాఘవరావు రోడ్లు భవనాలశాఖా మంత్రిగా పనిచేశారు. ఆయన హయాంలోనూ దీన్ని చేపట్టలేక పోయారు. ఇపుడూ ఇదే స్థితికొనసాగుతోంది. ఈ రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇంకా చెప్పాలంటే నరకంగానే ఉంది. ఒంగోలు నుంచీ పేర్నమిట్ల వరకూ ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ గతంలో నాలుగులైన్లకు విస్తరించారు. అక్కడ నుంచీ మళ్లీ దీన్ని పట్టించుకున్నదాఖలాల్లేవు. ఎప్పుడో నిర్మించిన రహదారి ఇది. పూర్తిస్థాయిలో రెండు వరుసలు కూడా లేదు. ఈ రోడ్డులో ఆర్టీసీబస్సులు, గ్రానైట్‌లారీలు, టిప్పర్లు, ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు, ప్రవేటు వాహనాలు, కాలేజీల బస్సులు ఇలా గంటలకు వందల సంఖ్యలో తిరుగుతుంటాయి. క్రాస్‌చేసి వెళ్లే పరిస్థితి కూడా లేదు. భారీ రద్దీ ఉంటుంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. చీమకుర్తి పశ్చిమప్రాంతం నుంచీ మర్రిచెట్లపాలెం బ్రిడ్జి వరకూ ప్రయాణం నరకంగా మారింది. రోడ్డు అనేక చోట్ల గుంటలు పడ్డాయి. మోకాళ్లలోతులోనూ కొన్నిచోట్ల గుంటలు పడ్డాయి. మర్రిచెట్లపాలెంలోనే పెద్ద గుంటలు ఏర్పడ్డాయి. వర్షాలకు రోడ్డు వాగులా మారింది. వాహనాలు గుంటల్లో పడి దెబ్బతింటున్నాయి. గుంటలున్నచోట్ల స్థానికులు కర్రపెట్టి దానికి జెండా కట్టారు. ఉప్పలపాడు వద్ద బస్టాండు సెంటర్లోనే పెద్ద గుంట ఉంది. ఇక క్వారీల మధ్య రోడ్డు భారీ డంపర్లు, గ్రానైట్ లారీల దెబ్బకు పెద్దపెద్ద గోతులు పడ్డాయి. గుంటల్లోమట్టి కూడా పోసేనాథుడు లేడు. ముసినదిపై బ్రిడ్జి కూడా గుంటలమయమైంది. ఎప్పుడు కూలుతుందోనన్న ఆందోళన కూడా కలుగుతోంది. వర్షపు నీరు చేరిందంటే కార్లకు చిన్న వాహనాలకు రాకపోకలకు కష్టంగా మారింది. దుమ్మూధూళిలోనే ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో జనం ప్రయాణిస్తున్నారు. క్వారీల ప్రాంతంలో సుమారు పదికిలోమీటర్లు వరకూ దుమ్ములోనే ప్రయాణం సాగాలి. పెద్దపెద్ద గ్రానైట్ యంత్రాల నడుమ ప్రయాణం ప్రమాదంగా మారింది. నిత్యం ఎక్కడోచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఒంగోలు పొదిలి నడుమ 50 కిలోమీటర్ల దూరం ఉంది. బస్సుల్లో గంటన్నర పడుతోంది. కార్లలో వెళ్లినా గంటకుపైనే పడుతోంది. ఇలా ఈ రహదారి ప్రయాణం ప్రమాదంగా ఉంది. ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా దీనిపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఎస్.ఆర్. శంకరన్ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా


ఎస్.ఆర్. శంకరన్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

సుపరిపాలన, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేసిన మంచి ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్. శంకరన్ అని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ఎస్ ఆర్ శంకరన్ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఎస్ ఆర్ శంకరన్ జీవితంపై ఫుడ్ సైన్స్ కళాశాలలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు కలెక్టర్ పతకాలు, జ్ఞాపికలను అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగులంతా శంకరన్ స్ఫూర్తితో కలిసి పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సభ్యులు జీవి, మానం అప్పారావు, కరణం రవీంద్ర, బందా బాబు, అధ్యాపకులు డాక్టర్ వినోద్ పాల్గొన్నారు.

సెమీస్‌లో 'ప్రకాశం' జట్టు

అనంతపురంపై 12 పరుగుల తేడాతో గెలుపు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జర్నలిస్ట్ స్పోర్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జెశాఫ్) ఆధ్వర్యంలో అనంతపురంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్ క్రికెట్ పోటీల్లో ప్రకాశం జట్టు సెమీఫైనల్ కు చేరుకుంది మంగళవారం మధ్యాహ్నం ఆర్‌టిడి గ్రౌండ్స్‌లో అనంతపురం జట్టుతో జరిగిన మ్యాచ్లో ప్రకాశం జట్టు 12 పరుగులు తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ప్రకాశం జట్టు నిర్ణీత 15 ఓవర్లల్లో 138 పరుగులు చేసింది. ఈ జట్టులో బ్యాటర్ జి.వెంకట్ 42 బంతుల్లో 66 పరుగులు, అంకబాబు 24 పరుగులు చేశారు 139 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు 126 పరుగులే చేయగలిగింది. ప్రకాశం జిల్లా బౌలర్ రవి కిరణ్ అద్భుతంగా బౌలింగ్‌తో ఆకట్టుకున్నారు. బుధవారం సెమీ ఫైనల్స్‌లో ప్రకాశం జట్టు తూర్పుగోదావరి జట్టుతో తలపడనుంది.

ఒంగోలులో ఉత్సాహంగా 'స్పేస్ వాక్'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అంతరిక్ష వారోత్సవాలలో భాగంగా సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్), ఇస్రో, ఒంగోలు క్విస్ విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఒంగోలులో అంతరిక్ష వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు మంగళవారం ఒంగోలులో అంతరిక్ష నడక (స్పేస్ వాక్)ను నిర్వహించారు.ఈ ర్యాలీని ఒంగోలు డీఎస్పి ఆర్.శ్రీనివాసరావు, షార్ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ, క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి గాయత్రి దేవి ప్రారంభించారు. ఒంగోలు జిల్లా ఎస్పి కార్యాలయం నుంచి అద్దంకి బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. ఇస్రో ప్రయోగించే రాకెట్లు, ఉపగ్రహాల నమూనాలను ర్యాలీలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఒంగోలు డిఎస్పి మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనలు, రాకెట్లు వాటి పనితీరు ప్రజలకు, విద్యార్థులకు తెలియజేసే విధంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి గాయత్రి దేవి ఇలాంటి గొప్ప కార్యక్రమానికి క్విస్ ఇంజనీరింగ్ కళాశాల వేదిక కావటం గర్వకారణంగా ఉందన్నారు. ర్యాలీలో క్విస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి హనుమంతరావు, డీపీఎస్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, సిఎస్ సిడిఈ డీన్ డాక్టర్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ సెలెక్షన్స్ పూర్తి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 69వ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్-17 బాలురు, బాలికల వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్ కం సెలక్షన్స్ మంగళవారం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.కిరణ్ కుమార్ ఆదేశాల మేరకు ఒంగోలులోని భారత జాతీయ వ్యాయామ కళాశాలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించి జాతీయ స్థాయికి అర్హత సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ చెక్క వెంకటేశ్వర్లు, ఏ.శిరీష కుమారి, బి.భక్తద్రుడు, ఈ.అశోక్ కుమార్, ఏ.మస్తాన్, బి.ఎస్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

220 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు మండలం ఎం.ముప్పాళ్లలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 220 మందికి డాక్టర్లు రామాంజనేయులు, స్వాతి కంటికి సంబంధించిన పరీక్షలతో పాటు ఈసీజీ, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు అందజేశారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కుపాదం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్


మాట్లాడుతున్న పి.కృష్ణయ్య

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్పర్సన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్య అన్నారు. మంగళవారం కాలుష్య నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ప్రకాశం భవనంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ పి.రాజాబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఇతర అధికారులతో వివిధ అంశాలపై కృష్ణయ్య చర్చించారు. ఈ సందర్భంగా పి కృష్ణయ్య మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటు ద్వారా, ముఖ్యంగా ప్రకాశం వంటి జిల్లాలలో ఉపాధి అవకాశాలు పెంచాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. అదే సమయంలో కాలుష్యాన్ని కూడా తగ్గించడంపై దృష్టి సారించాల్సిన అవసరం సంబంధిత శాఖలపై ఉందన్నారు. కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగ నివారణ, వివిధ రంగాల ద్వారా వచ్చే కాలుష్యాన్ని నివారించేందుకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్ పర్సన్ చేసిన సూచనలను సంబంధిత శాఖలు సమన్వయంతో అమలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.. ఈ సమావేశంలో డిపిఓ ఎం.వెంకటేశ్వరరావు, గనుల శాఖఉపసంచాలకులు టి. రాజశేఖర్, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాఘవరెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఒంగోలు ఆర్డిఓ కళావతి, జిల్లా వ్యవసాయ అధికారి (ఇంచార్జ్) రజనీకుమారి, డీఎస్ఓ పద్మశ్రీ, ఏపీ ఎం.ఐ.పీ. పీ.డీ. శ్రీనివాసులు, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ గోపీచంద్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, అన్ని మునిసిపాలిటీలు, అటవీ, రవాణాశాఖల అధికారులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న టిడిపి నేత కృష్ణ కిషోర్ రెడ్డి

సైనికునికి కడసారి కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం, కృష్ణంశెట్టిపల్లె గ్రామానికి చెందిన దాసరి చిన్న తిరుమలయ్య ఆర్మీలో విధులు నిర్వహిస్తూ మరణించారు. ఆర్మీ అధికారులు ఆయన భౌతికాయాన్ని స్వగ్రామానికి చేర్చి మంగళవారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. గిద్దలూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ యువనేత ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి సైనికుడు తిరుమలయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. సైనికుని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. సైనికుని కడసారి కన్నీటి వీడ్కోలు కార్యక్రమములో గిద్దలూరు మండల తహశీల్దార్ ఎం ఆంజనేయరెడ్డి, పాలుగుళ్ల హనుమంతరెడ్డి, చిన్న శ్రీనివాసరెడ్డి, ఆర్మీ జవానులు, పోలీస్ సిబ్బంది, ప్రజలు నివాళులు అర్పించారు.

మానసిక ఆరోగ్య వారోత్సవాలు

ప్రజాశక్తి-పెద్దారవీడు

ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల వేడుకలు పెద్దారవీడు గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం జరిగాయి. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం వలన ఉపయోగాలు, మంచి ఆరోగ్యం, మంచి విద్య వలన మానసిక స్థిరత్వం అనే అంశాలపై సమగ్ర శిక్ష సారథ్యంలో మానసిక నిపుణులు నారాయణం లావణ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జి ఫీబే, ఇన్‌ఛార్జులు డి రత్నప్రియ, జి నీలిమ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, కమిటీ చైర్మన్ ఆవులక్క పాల్గొన్నారు. పిల్లలకు అవసరమైన అన్ని విషయాలూ వివరించారు. మానసికంగా స్థిరత్వం ఎలా పెంచుకోవాలి, ఆరోగ్య విషయాలు, ఫిజికల్ ఫిట్నెస్, చక్ర హీలింగ్, ధ్యానం,

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సంతనూతలపాడు పిహెచ్‌సిలోనూ, పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యం యుపిహెచ్‌సిలోనూ అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు పని ఒత్తిడి పెరిగిందని, ఒత్తిడిని తగ్గించాలని కోరారు. పనికి తగ్గ కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వం ఇస్తున్న జాతీయ సెలవులు, పండగ సెలవులు, వారాంతపు సెలవులు ఆశాలకు వర్తింపజేయాలని కోరారు. 2జి మొబైల్ స్థానంలో 5జి మొబైల్ సిమ్ ఇవ్వాలని, దహన సంస్కారాలకు రూ.20,000 ఇవ్వాలని అన్నారు. పిహెచ్‌సికి వెళ్లిన ప్రతి సందర్భంలోనూ టిఏ, డి.ఏలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వాలు యజమానుల కనుగుణంగా మార్చుతూ 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ చేసిన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు డి మాధవి, పిచ్చమ్మ, సుజాత, సుకన్య, పద్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్ర వ్యాప్తంగా వాల్మీకులను ప్రాంతీయ బేధాలు లేకుండా ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి దేవాలయ కమిటీ అధ్యక్షులు మండ్లా రామాంజనేయులు కోరారు. వాల్మీకి మహర్షి జయంతిని సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. వాల్మీకి జయంతి సందర్భంగా పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో గల వాల్మీకి మహర్షి ఆలయంలో జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. అనంతరం స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్‌లో నిర్వహిచిన సభలో మండ్లా రామాంజనేయులు మాట్లాడారు. వాల్మీకులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం పట్టణ నాయకులు భూపని కాశయ్య, బోగెం కాటంరాజు, నల్లబోతుల కొండయ్య, అచ్చయ్య, శ్రీనివాసరావు, మండ్ల శ్రీనివాసులు, నల్లబోతుల మల్లికార్జున, మాగి పోలయ్య తదితర వాల్మీకి పెద్దలు పాల్గొన్నారు.

ఓట్ల దొంగా.. గద్దె దిగు!

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి-టంగుటూరు

ఓట్లదొంగా.. గద్దె దిగు అనే నినాదంతో ప్రజల మద్దతు కోరుతూ కొండపి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి శ్రీపతి సతీష్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ టంగుటూరు మండలం ఆలకూరపాడు, అనంతవరం గ్రామాలలో జరిపారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఓట్ చోర్.. గద్దె చోడ్ దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా కొండపి నియోజకవర్గంలో తాము ప్రజల మద్దతు కోరుతున్నామని, ప్రజలు కూడా నరేంద్ర మోడీ పట్ల విసిగి వేసారిపోయి ఉన్నారని, కేవలం దొంగ ఓట్లు లక్షలలో చేర్చుకొని తమకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించారని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని తెలిపారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్త ఉద్యమంలో దేశ ప్రజలను ఆకర్షించారని, రాబోయే రోజుల్లో నరేంద్ర మోడీకి గడ్డు కాలమే అని రేపు బీహార్ ఎన్నికలలో కాంగ్రెస్ కూటమి విజయ దుందుభి మోగిస్తుందని, రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ వైఎస్ షర్మిలారెడ్డి నేతృత్వంలో బలపడబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నరేంద్రమోడీ వల్ల రాష్ట్రానికి ఏ ప్రయోజనమూ కలగడం లేదు కాబట్టి చంద్రబాబు కూడా బిజెపికి మద్దతు ఉపసంహరించాలని సతీష్ కోరారు.



సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీపతి సతీష్

సంతకాల సేకరణలో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం బిజెపి పట్టు కోల్పోతోంది అని చెప్పడానికి ఇదే నిదర్శనం అని సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు బి శశికుమార్, టంగుటూరు మండల నాయకులు గంగుల పోలయ్య, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి మహేష్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వేశపోగు దావీదు, ఇతర కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ప్రముఖుల ఆశీర్వాదం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు మాజీ సర్పంచ్, బాపట్ల పార్లమెంట్ టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు సోదరుడు శ్రీనివాసరావు కుమార్తె వివాహ రిసెప్షన్ వేడుకల్లో పలువురు పాల్గొని నూతన వధూవరులైన పావని, రాజేష్‌లను చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం సుకన్య, సంతనూతలపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ వేజెండ్ల అజయ్‌బాబు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి అడకా స్వాములు, మండల టిడిపి అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండల టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు తదితరులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త కొప్పోలు రామారావు, జిల్లా ఆర్యవైశ్య నాయకులు పబ్బిశెట్టి శ్రీనివాసరావు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకట సురేష్‌బాబు, మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు కే గోపికృష్ణ, ఎనికపాడు సర్పంచ్ తలారి వెంకట్రావు, చెన్నకేశవ స్వామి ఆలయ చైర్మన్ దుంపా సుబ్బారెడ్డి, పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణమోహన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుంపా యల్లమందారెడ్డి, టిడిపి, జనసేన నాయకులు బొడ్డపాటి చంద్రశేఖర్, షేక్ నాయబ్, మద్దిరాల శ్రీనివాసరావు, మనబోతు బ్రహ్మయ్య, ఎస్ కొండలరావు, కోతి కోటేశ్వరరావు, జె లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, అంబేద్కర్ సంఘ నాయకులు ప్రకాశం, మార్పుడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. పాస్టర్ టి జాషువా ప్రార్థనలు నిర్వహించారు.



రిసెప్షన్ వేడుకల్లో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ప్రముఖులు

ఏరియా వైద్యశాలకు స్వచ్ఛాంధ్ర అవార్డులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సిబ్బంది సమన్వయంతో ప్రజలకు అందించిన సేవలకు పురస్కారం లభించిందని యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దేవర యదిద్యా తెలిపారు. ఒంగోలులోని రిమ్స్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధ్యక్షతన జిల్లా స్థాయిలో జరిగిన స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర 2025 అవార్డ్స్ కార్యక్రమంలో భాగంగా పురస్కారాలు ప్రదానోత్సవంలో యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు పురస్కారం దక్కింది. ఈ మేరకు కలెక్టర్ రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ఉడా చైర్మన్ రియాజ్, డిసిహెచ్ శ్రీనివాస్ నాయక్‌ల చేతుల మీదుగా ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దేవర యదిద్యాకు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ దేవర యదిద్యా వైద్యశాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాల పారిశుధ్య కార్మికుల కృషి, వైద్యులు అందించిన సేవలు, ప్రజల సహకారం, స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహం, ప్రజాప్రతినిధులు పరిశుభ్రతపై నిర్వహించిన కార్యక్రమాల వల్ల అవార్డు రావడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పరిశుభ్రతపై బాధ్యతగా వ్యవహరిస్తూ రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. వైద్యశాలను రాష్ట్రంలోనే గుర్తింపు వచ్చే విధంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. త్వరలో జిల్లా కలెక్టర్ రాజాబాబు వైద్యశాలను సందర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చలపతినాయక్, షేక్ ముబీన, పద్మావతి, విజయకుమారి, మనోజ్ ఖన్నా, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు చూపుతున్న ఆసుపత్రి సిబ్బంది



దెబ్బతిన్న కారు

హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు

తృటిలో తప్పిన ఘోర రోడ్డు ప్రమాదం

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలో మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం త్రుటిలో తప్పిపోయింది. పొదిలి పెద్ద బస్టాండ్ సెంటర్‌లో పాత పోస్ట్ ఆఫీస్ వద్ద ఒంగోలు నుంచి కనిగిరి వైపు వెళ్తున్న ఎర్టిగా కారు చోదకుడు మద్యం సేవించి వాహనాన్ని అతి వేగంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టి మూసివేసిన హోటల్లోకి దూసుకెళ్లాడు. నిత్యం రద్దీగా ఉండే హెూటల్ మంగళ వారం త్వరగా మూసివేసి ఇంటికిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికే ఎదురుగా వస్తున్న కారుకు డాష్ ఇవ్వడంతో అందులోని ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళన గురయ్యారు. మద్యం సేవించి కారు నడిపిన డ్రైవర్‌ను స్థానికులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నివేశన స్థల దురాక్రమణదారుడు అరెస్ట్

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని బాపూజీ కాలనీ లో నివేశన స్థలాన్ని దురాక్రమించిన షేక్ అబ్దుల్ రెహమాన్‌ను అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్ఐ ఎం సైదుబాబు మంగళవారం తెలిపారు. గోపాలుని లక్ష్మీ భవానికి బాపూజీ కాలనీలో ఇంటి స్థలం ఉంది. ఆ స్థలాన్ని అబ్దుల్ రెహమాన్ ఆక్రమించినట్లు బాధితులు ఆరోపించారు. ఆక్రమణను అడ్డుకున్న సమయంలో దాడికి పాల్పడ్డారని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల కేసు నమోదైంది. ఈ దాడిలో అబ్దుల్ రెహమాన్‌కు మద్దతుగా పాల్గొన్న కందుకూరి శంకరాచారిపై కూడా కేసు నమోదయింది. వీరిరువురినీ కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు పట్టణ ఎస్ఐ సైదుబాబు తెలిపారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎరిక్షన్‌బాబు

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలం రామచంద్ర కోట గ్రామానికి చెందిన యువకులు బొమ్మన బోయిన కొండలరాజు, ధనంకుల లక్ష్మయ్యలు పెద్దారవీడు ఎస్ కొత్తపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాలను ఎర్రగొండ పాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గూడూరు ఎరిక్షన్ బాబు మంగళవారం పరామర్శించారు. మార్కాపురం లోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల మార్చురీలో ఉన్న మృత దేహాలకు నివాళి అర్పించారు. బాధిత కుటుంబీకులను ఓదార్చారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాబు, దేవయ్యాచారి, బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన జిఎస్‌టి అమలు చేయాలి

ప్రజాశక్తి-మార్కాపురం

పాత జిఎస్‌టి ప్రకారం కాకుండా.. నూతన జిఎస్‌టి అమలు చేయాలని మార్కాపురం జిఎస్‌టి కార్యాలయ అధికారి నరసింహులు సూచించారు. తగ్గిన జిఎస్‌టిపై మంగళవారం మార్కాపురంలోని పలు వ్యాపార సంస్థల్లో కరపత్ర ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాత జిఎస్‌టి అమలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహాయ అధికారి సుమన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జడ్జిపై దాడి చేసిన లాయర్‌ను శిక్షించాలి

• మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్‌ను బహిష్కరించాలి • సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య • న్యాయవాదులు విధులు బహిష్కరణ

ప్రజాశక్తి - బాపట్ల

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై మతోన్మాద న్యాయవాది చేసిన దాడి యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. గవాయ్‌పై దాడికి నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో నిరసన మంగళవారం నిరసన తెలిపారు. ఈ దాడి ఒక వ్యక్తిపై కాదని, యావత్ భారత దేశం ప్రామాణికం, భారత రాజ్యాంగంపై దాడని అన్నారు. ప్రపంచ దేశాల ముందు ప్రజాస్వామ్య ఔన్నత్యాన్ని కించపరిచే చర్య అన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, రాజకీయ లబ్ది పొందుతున్న ఆర్‌ఎస్‌ఎస్ సంస్థను స్వయంగా దేశ ప్రధాని స్వాతంత్ర్య సంబరాల్లో ఎర్రకోట సాక్షిగా జెండా ఎగురవేసి స్వాతంత్రోద్యమానికి ఏమాత్రం సంబంధంలేని, బ్రిటీష్ పాలకులకు తొత్తులుగా పనిచేసిన ఆర్‌ఎస్‌ఎస్‌ను కొనియాడడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆర్‌ఎస్‌ఎస్ పోరాడిందని స్వయంగా దేశ ప్రధాని అబద్దాలు చెప్పడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి కృష్ణమోహన్, సిహెచ్ ముజుందర్, పి కొండయ్య, కె శరత్, కె నాగేశ్వరావు, టి సుభాషిణి, మహబూబ్ సుభాని, చిన్న పాల్గొన్నారు.

చీరాల : సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషన్ బూటు విసరడం భారత రాజ్యాంగంపై సనాతన ధర్మం చేసిన దాడని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ఆరోపించారు. దళిత మహాసభ కార్యాలయంలో మాచవరపు జూలియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత ప్రధాన న్యాయమూర్తిపై సుప్రీంకోర్టులోనే దాడి జరగడం దేశ ప్రజాస్వామ్యానికి మచ్చని పేర్కొన్నారు. రాకేష్ కిషన్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య, ఎంఎస్పీఎస్ జిల్లా అధ్యక్షుడు తేళ్ల జయరాజు, దళిత నాయకులు కాకుమాను రవి, గొర్రెముచ్చు ఏలీయా పాల్గొన్నారు.

ముద్దమూరు : న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ మండలంలోని మారేళ్లలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడారు. దాడిని ఖండించారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ శ్రీను, టి అంజయ్య, టి హనుమంతరావు, హరిబాబు, గోసాల శ్రీను, బ్రహ్మం, ఎస్ ఆంజనేయులు, జి కోటేశ్వరావు, సిహెచ్ అంజయ్య, జి ఆంజనేయులు, వేణు పాల్గొన్నారు.

రేపల్లె : దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయి బెంచ్ వద్ద ఒక కేసులో వాదనలు జరుగుతున్న సమయంలో న్యాయవాది రాకేష్ కోర్టు హాల్లో బిగ్గరగా కేకలు వేస్తూ చెప్పు విసరడానికి చేసిన అప్రజాస్వామిక చర్యలను ఖండిస్తూ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ముక్తకంఠంతో మంగళవారం విధులు బహిష్కరించారు. తాలూకా సెంటర్లోని బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. సుప్రీంకోర్టు న్యాయవాది రాకేష్‌ను న్యాయవాద వృత్తి నుండి శాశ్వత బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపిపి అనగాని శ్రీనివాసమూర్తి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉప్పాల శ్రీనివాసరావు, మాజీ ఎజిపి దారం సాంబశివరావు, కర్రా ఐజాక్, న్యాయవాదులు గుంటూరు విజయ కుమారి, కట్టుపల్లి కాకమ్మ, ఎం వెంకటేశ్వరరావు, గుడిపల్లి రవి, గురిందపల్లి రామారావు, కాకుమాను గురు బ్రహ్మం, నాలాది పోతురాజు, రేవు నాగరాజు, గుమ్మడి కుమార్ బాబు, మునిపల్లి సుబ్బయ్య, కర్రా జయరావు, నల్లూరి వెంకటేశ్వరరావు, దోవా రమేష్ రాంజీ పాల్గొన్నారు.



జడ్జిపై దాడికి సిపిఎం నాయకుల నిరసన

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 'మురుగుడు'

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులుగా భట్టిప్రోలుకు చెందిన మురుగుడు సత్యనారాయణ ఎన్నికయ్యారు. సోమ, మంగళ వారాల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన ఆ సంఘ రాష్ట్ర మహాసభలో నూతన కమిటీ మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణను చేనేత నాయకులు బట్టు నాగమల్లేశ్వరరావు, దీపాల సత్యనారాయణ, దొంతు కోటేశ్వరరావు, ప్రజాసంఘాల నాయకులు గొల్ల నాగరాజు, పప్పల మనోజ్, టి కృష్ణమోహన్ అభినందించారు.


ఎం సత్యనారాయణ



తరలి వెళ్తున్న యుటిఎఫ్ శ్రేణులు

సిపిఎస్ రద్దు పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - కనిగిరి

సిపిఎస్ రద్దు, ఆర్థిక, విద్యారంగ పరిరక్షణ కోసం ఫ్యాప్టో తలపెట్టిన చలో విజయవాడకు యుటిఎఫ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు ముక్కు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు సిపిఎస్ రద్దు గురించి ప్రస్తావన లేదని అన్నారు. బకాయిల చెల్లింపులో నిర్లక్ష్య ధోరణి, ఉపాధ్యాయ, ఉద్యోగుల జీతభత్యాల పెంపుపై పిఆర్సి నియమించక పోవడం శోచనీయమని పేర్కొన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ ఖాజారహంతుల్లా, జిల్లా కార్యదర్శి టి రమణారెడ్డి, ఎం రాము, కనిగిరి, వెలిగండ్ల, పిసిపల్లి, హెచ్ఎంపాడు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పట్సం నరసింహం, టివి సుబ్బారెడ్డి, ఉమామహేశ్వరి, ఏసుబాబు, రమేష్, బాలకృష్ణ తరలివెళ్లారు.


సహమావేశంలో మాట్లాడుతున్న పి కొండయ్య

సిఐటియు మహాసభలు

ప్రజాశక్తి - బాపట్ల

సిఐటియు అఖిలభారత మహాసభలు డిసెంబర్ 31న జయప్రదం చేయడానికి ఆర్థిక, హార్థిక సహాయ సహకారాలు అందించా లని సిఐటియు నాయకులు పి కొండయ్య కోరారు. వెదుళ్ళ పల్లి, నర్సాయపాలెం గ్రామాల్లో మంగళవారం జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభల సందర్భంగా మహాప్రదర్శనకు అందరూ హాజరు కావాలని కోరారు. సిఐటియు నాయకులు తిరుమల, వెంకటేశ్వరమ్మ, సుమతి పాల్గొన్నారు.


బహూకరించిన కంప్యూటర్లు

కంప్యూటర్లు బహూకరణ

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని దుద్దుకూరులో ఉన్న ఆచార్య రంగా ఉన్నత పాఠశాలకు జుజ్జుకూరు గ్రామ వికాస్ సొసైటీ తరపున సొసైటీ ప్రెసిడెంట్ చెన్నుపాటి జనార్దన్ కంప్యూటర్లు బహూకరించారు. విద్యార్థుల సౌలభ్యంకు కంప్యూటర్లు అందజేసినట్లు జనార్దన్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి ఎం చంద్రకళ పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరూ కలసి పనిచేయాలి

ప్రజాశక్తి - కనిగిరి

పట్టణ అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో నీటి సరఫరా, విద్యుత్ సమస్యలు తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న మునిసిపల్ ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రస్తుతం ఉన్న 20 వార్డులను 28 వార్డులుగా పునర్విభజన చేసినట్లు టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ సువర్ణ కుమార్ తెలిపారు. చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తున్నామని అన్నారు. పట్టణంలో రెండు పిహెచ్‌సి పనులు పూర్తి కాగానే ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. అజెండాలోని 62 అంశాలు, రూ.5.24 కోట్లతో బడ్జెట్ ఆమోదం తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో స్వచ్ఛ కనిగిరి అవార్డు పొందిన సభ్యులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కమీషనర్ పి కృష్ణమోహనరెడ్డి, వైస్ చైర్మన్లు పులి శాంతి, మాణిక్యరావు, మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు తొలగిన అడ్డంకులు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

మండలంలోని దేగరమూడిలో కొంతమంది టీడీపీ నాయకుల ప్రోద్బలంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు విగ్రహాన్ని తొలగించారని గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ చారువాక, నీలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో ఆందోళనకు దిగి ధర్నాలు నిర్వహించారు. దీంతో బాపట్ల ఆర్డిఓ గ్లోరియా, డిఎస్పి రామాంజనేయులు, కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఇరువర్గాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో విగ్రహం ఏర్పాటుకు అభ్యంతరం లేదని తెలపడంతో దేగరమూడిలో విగ్రహానికి అడ్డంకులు తొలగిపోయాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మోసపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కొల్లూరు

కల్తీ విత్తనాలతో మోసపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకట రామయ్య డిమాండ్ చేశారు. మండలంలోని అనంతవరంలో వరి పంటలో బెరుకు ఎక్కువగా ఉండటం వల్ల గ్రామంలోని రైతులు ఎ.ఒ వి నరేంద్రబాబు, ఎన్ఆర్ఐ విత్తన కంపెనీ ప్రతినిధులతో కలిసి వరి పంట పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడారు. చర్చల్లో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని రైతు సంఘం నాయకులు కంపెనీ ప్రతినిధులను డిమాండ్ చేశారు. ఈ నెల 15వరకు సమయం కావాలని, రైతులందరికీ న్యాయం చేస్తామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొనిగల సుబ్బారావు, దూళిపాల రవి, జాలది రంగారావు, నాగళ్ల కృష్ణారావు, శివ రామకృష్ణ, జాలది సాంబయ్య, సాయిబాబా, అశ్విని కుమార్, నాని పాల్గొన్నారు.


వరిపైరు పరిశీలిస్తున్న అధికారులు, రైతు నాయకులు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసిపి ఇన్చార్జ్ దద్దాల

కార్యకర్తల రక్షణకే డిజిటల్ బుక్

ప్రజాశక్తి - కనిగిరి

కూటమి పాలనలో అన్యాయానికి గురైన వైసీపీ కార్యకర్తలు, ప్రజల రక్షణ కోసం వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'డిజిటల్ బుక్' ప్రారంభించారని వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. అన్యాయానికి గురైన కార్యకర్తలు వెబ్‌సైట్‌లో లేదా 04049171718 నంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె ఆదెన్న, చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జడ్పిటిసి మడతల కస్తూరిరెడ్డి, పులి శాంతి, ఆదినారాయణరెడ్డి, భాస్కరరెడ్డి, తమ్మినేని సుజాతరెడ్డి, మల్లెల యాకోబు, మాణిక్యరావు, సాల్మన్ రాజు, ఎస్ మోహనరెడ్డి, సింగ కృష్ణారావు, శ్రీనివాసులు, పులి శీను, పి సిద్దారెడ్డి, డి నాగేంద్రరెడ్డి, అబ్రహం లింకన్, రహీం, రసూల్ పాల్గొన్నారు.

కారంచేడు గ్రామంలో సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - కారంచేడు

వివిధ సమస్యలపై కలెక్టర్ వి వినోద్ కుమార్‌కు కారంచేడు గ్రామ ప్రజలు వినతి పత్రాలు ఇచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ నిమిత్తం మంగళవారం కారంచేడు వచ్చిన ఆయనను గ్రామ ప్రజలు కలిసి గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. భూ సమస్యలు, పెన్షన్, పొగాకు సమస్య, స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద మురుగు నీటి పారుదల ఏర్పాటు చేయాలని కోరారు. పరిశీలించి పరిష్కారం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, కారంచేడు, యద్దనపూడి తహశీల్దారులు నాగరాజు, రవికుమార్, ఎంపిడిఒ కె నేతాజీ ఉన్నారు.


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేసిన

న్యాయవాదిని శిక్షించాలి

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి-టంగుటూరు

దళితుడైనందుకే సుప్రీంకోర్టు సిజెఐ బిఆర్ గవాయ్‌పై సనాతన ధర్మాన్ని అవమానించారంటూ న్యాయవాది కిషోర్ రాకేష్ చెప్పుతో దాడికి యత్నించారని, దాడికి పాల్పడిన మతోన్మాద, మనువాద న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని కోరుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టంగుటూరు బొమ్మల సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరు రాము అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ దళిత, గిరిజనులు ఏ స్థాయిలో ఉన్నా మతోన్మాదుల నుంచి, మనువాదుల నుంచి అవమానాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సీజేఐపై చెప్పుతో దాడి చేయడం అంటే సనాతన పేరుతో నాగరికతను ధ్వంసం చేసే చర్యగా ఉందని అభివర్ణించారు. ఈ దాడి దేశ ప్రజలు సిగ్గుతో తలదించుకునేలా ఉందని విచారం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా సిజెఐ బిఆర్ గవాయ్ తన విధులు తాను నిర్వహిస్తున్న క్రమంలో న్యాయవాది ముసుగులో దాడి చేయడం ముమ్మాటికి మతోన్మాద చర్యగా పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో దళిత రాష్ట్రపతులైన కేఆర్ నారాయణన్, రామనాథ్ కోవింద్, ద్రౌపది ముర్ములకు గుడులలో ప్రవేశం కల్పించలేదని, ఇదేనా సనాతన ధర్మమని ప్రశ్నించారు. దళితుడైన బంగారు లక్ష్మణ్ భారతీయ జనతా పార్టీ(బిజెబీ)కి జాతీయ అధ్యక్షుడిగా నియామకం జరిగితే ఓర్వలేని మతోన్మాదులు లక్ష రూపాయలు లంచం ఇచ్చి సస్పెండ్ చేశారని, ఇదేనా సనాతన ధర్మమని ప్రశ్నించారు. దేశ అత్యున్నత స్థాయి పదవుల్లో ఉన్న దళితులకే ఈ గతి పడుతుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మతోన్మాదులను, మనువాదులను తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఈ దాడిని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించి ప్రజాస్వామ్య పరిరక్షణకు పూనుకోవాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురామ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పుకునే అవకాశం కూడా లేకపోవడం బాధాకరమని అన్నారు. సనాతన ధర్మం పేరుతో కుల వ్యవస్థను పెంచేందుకు మనువాద మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని, ఆ దుర్మార్గమైన ఆలోచనతోనే ఇలాంటి దాడులు ప్రత్యక్షంగా పరోక్షంగా జరుగుతున్నాయని అన్నారు. అత్యున్నత పదవిలో ఉన్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై చెప్పుతో దాడి చేసేందుకు ప్రయత్నం చేసిన మతోన్మాది కిషోర్‌పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వేశపోగు మోజెస్, గడ్డం సాల్మన్, జి అంకయ్య, ఎం యానాది, సీఐటీయూ నాయకులు డి తిరుమలరావు, టీ పాపారావు తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరులో నిరసన తెలుపుతున్న కెవిపిఎస్, సిఐటియు నాయకులు


యర్రగొండపాలెంలో దళిత సంఘాల ఐక్యవేదిక నిరసన

యర్రగొండపాలెం: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడికి ప్రయత్నించిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం యర్రగొండపాలెం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. న్యాయ వ్యవస్థను కాపాడండి. దాడి చేసిన దోషిని కఠినంగా శిక్షించాలని, ప్రజాస్వామ్యన్ని రక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి ముప్పని, ఇది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదని, దేశయావత్తు సిగ్గు పడేలా న్యాయ వ్యవస్థపైన దాడి చేయటం హేయమైన చర్య అని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూర్ణకంటి తిరుమలయ్య, ఆలేటి నాగయ్య, సింగా ప్రసాద్, టిసిహెచ్ చెన్నయ్య, శ్రీనివాస్, కోటా డేవిడ్, బాణాల రామయ్య, రాచీటి ప్రసాద్‌రావు, రాములునాయక్, ఫిలిప్, అబ్రహాం, విజయ్‌కుమార్, మందా మరియబాబు, బాలకృష్ణ నాయక్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి: మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు

కొండపి నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంత్రి డాక్టర్ స్వామి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నూతన వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం, శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలపై మంత్రి చర్చించారు. నియోజకవర్గానికి మంజూరైన 66 శానిటరీ కాంప్లెక్స్ యూనిట్ల నిర్మాణం వెంటనే ప్రారంభించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. టంగూటురులో పీఎం అజయ్ కింద రూ.45 లక్షలతో నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణం, జడ్పీ నిధులు రూ.25 లక్షలతో పొన్నలూరు, రావులకొల్లు ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణం వెంటనే మొదలు పెట్టాలన్నారు. నియోజవర్గంలోని 6 మండలాల్లో ఎక్కడ నీటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావా లన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ వేణుగో పాలరావు, టంగుటూరు ఏఈ వెంకటేశ్వరరావు, జరుగుమల్లి ఏఈ జాన్‌పాల్‌రాజ్, శింగరాయకొండ ఏఈ రమేష్, పొన్నలూరు ఏఈ మహేంద్ర పాల్గొన్నారు.



కలెక్టర్, మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు బయన్న

ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలకు అవార్డు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఒంగోలులో జరిగిన అవార్డుల ప్రదాన కార్యక్రమంలో పుల్లలచెరువు మండలం మురికిమళ్ల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలకు అవార్డు లభించింది. ప్రధానోపాధ్యాయులు ఈ బయన్న కలెక్టర్ రాజాబాబు చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. ఆయనను శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. పుల్లలచెరువు మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయుడు బయన్నకు అభినందనలు తెలిపారు.


అన్నదానం చేస్తున్న దృశ్యం

మానసిక వికలాంగులకు అన్నదానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: ఈజిప్ట్ దేశానికి చెందిన అయేషా, సలీం తన అల్లుళ్ల హంజా, యోస్రి (కవల పిల్లలు) పుట్టినరోజు సందర్భంగా యర్రగొండపాలెం సమీపంలోని మాచర్ల రోడ్డులో గల సన్‌జో సేవాలయంలో ఆశ్రయం పొందుతున్న మానసిక వికలాంగులకు మంగళవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవాడకు చెందిన కలర్స్ గ్రూప్ (1977-78) పదో తరగతి బ్యాచ్) సభ్యుడు షేక్ అబ్దుల్ గఫార్ సమన్వయం చేశారు. ఆయన పరిచయస్తురాలు అయేషా, సలీం ఈ పుణ్యకార్యానికి ముందుకు వచ్చారని తెలిపారు. పుట్టిన రోజు జరుపుకున్న కవలలు హంజా, యోస్రిలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆశ్రమ నిర్వాహకుడు సుజిత్, దివ్యాంగులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమం లో కలర్స్ గ్రూప్ సభ్యులు షేక్ అతహర్ బాషా, తుమ్మలపల్లి సుబ్బారావు, జ్యోతి ప్రసాదరావు, ఇ వెంకట్రామయ్య, రియాజ్, జార్జి పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి-రాచర్ల

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గిద్దలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి అన్నారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మంగళవారం రాచర్ల మండలం రాచర్ల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో కృష్ణ కిషోర్ రెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మొదటగా వాల్మీకి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ, విద్యుత్, తాగునీరు, రోడ్లు సమస్యలపై ఎక్కువ శాతం అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కటికే యోగానంద్, సహకార సంఘం ఛైర్ పర్సన్‌లు గోపిరెడ్డి జీవన్‌రెడ్డి, భవనం పుల్లారెడ్డి, మాజీ జడ్పీటీసీ బత్తిని వెంకటేశ్వర్లు, అంబవరం శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి శ్రీధర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం కామర్స్, ఎకనామిక్స్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి ప్రదీప్, కోఆర్డినేటర్ డా రహమతున్నిసాబేగం, కళాశాల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడుగా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు మండల రేషన్ డీలర్ అసోసియేషన్ అధ్యక్షునిగా సీనియర్ డీలర్ ఏ వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. మండలంలోని పలువురు డీలర్లు వెంకటేశ్వర్లును అభినందించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని అన్నారు. మండల డీలర్ల అధ్యక్షుడిగా అందరినీ కలుపుకొని విధులు నిర్వహిస్తానని, మండలంలోని డీలర్లకు మంచి పేరు తీసుకొస్తారని ఆయన అన్నారు.


ఏ వెంకటేశ్వర్లు

వన్యప్రాణుల సంరక్షణపై వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని నలంద హైస్కూల్‌లో ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం సందర్భంగా అడవులు వాటి ప్రాముఖ్యత, వన్య ప్రాణుల సంరక్షణ గురించి ఎఫ్ఆర్వో ఏ ప్రసన్న జ్యోతి, డిఆర్ఓ శివకుమార్, కరెస్పాండెంట్ పద్మజ ఓబులరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పెమ్మసాయి చంద్రహాసరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలలోని విద్యార్థులకు యర్రగొండపాలెం అటవీ శాఖ అధికారుల ప్రత్యేక సహకారంతో జీవ వైవిధ్యం, అడవుల వలన మానవాళికి ఉపయోగాలు వంటి అంశాలపై అటవీ అధికారులు అవగాహన కల్పించారు. వన్య ప్రాణుల సంరక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు ఎఫ్‌బిఓఎస్ ఆర్ దాసయ్య, షేక్ ఫక్రుద్దీన్, జి వెంకటేశ్వర్లు, కృష్ణ చైతన్య, వెంకటేశ్వర్లు నాయక్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


అండర్ 19 జిల్లా హాకీ బాలికల జట్టు

అండర్-19 బాల బాలికల జిల్లా హాకీ జట్ల ఎంపికలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-19 బాల బాలికల జిల్లా హాకీ జట్ల ఎంపికలు మంగళ వారం జరిగాయి. ఈ ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారుల మధ్య పోటీలు నిర్వహించి క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు టి రవికుమార్, డి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో వివిధ జిల్లాలలో జరగబోయే రాష్ట్ర స్థాయి టోర్నమెంటులో పాల్గొంటారని ప్రకాశం జిల్లా అండర్-19 ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చింపారెడ్డి తెలిపారు. ఈ ఎంపికలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డీవీఎల్ నరసింహారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైనంపాడు గ్రామ పంచాయతీ సెక్రెటరీ పి రవికుమార్ డైట్ లెక్చరర్ తిరుపతయ్య, ఉపాధ్యాయులు హనుమాచారి, పీడీలు వనజ, కౌసల్య, సౌజన్య, కోటిరెడ్డి పీఈటీ తిరుమలశెట్టి రవికుమార్ పాల్గొన్నారు.


అండర్ 19 జిల్లా హాకీ బాలుర జట్టు


స్మారక సంచిక కలెక్టరుకు అందిస్తున్న బాబురావు

ఎస్ఆర్ శంకరన్ స్మారక సంచిక

ప్రజాశక్తి - బాపట్ల

ఐఎఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ వర్ధంతి సందర్భంగా బహుజన కెరటాలు ప్రచురించిన స్మారక సంచికను కలెక్టర్‌కు ఎపి దళిత మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకతోటి బాబురావు మంగళవారం అందజేశారు. బడుగు వర్గాల సంక్షేమ సారధి, నిజాయితీ, నిస్వార్థానికి మారుపేరైన ఐఎఎస్ అధికారి శంకరన్ జీవిత విశేషాలు సంచికలో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఏలూరి కృషితో నిధులు విడుదల

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషితో సిమెంట్ రోడ్లు, డ్రైన్లు అభివృద్ధికి 104 పనులకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.15.70 కోట్లు మంజూరు అయ్యాయి. మొదట విడత లో రూ.6.82 కోట్లు మంజూరు కాగా వీటిలో రూ.6.30 కోట్లు పనులు పూర్తయ్యాయి. రూ.52 లక్షల పనులు పూర్తి చేయాల్సి ఉంది. 2వ విడతలో 61పనులకు రూ.8.88 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులు ప్రారంభించాల్సి ఉంది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నగదు బహుమతి అందజేస్తున్న డిప్యూటీ డిఇఓ శ్రీనివాసరెడ్డి

విద్యార్థులకు నగదు బహుమతి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండలంలోని మర్రిపాలెం జడ్‌పి ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు బచ్చల కూరపాడు పంచాయతీ మెట్టువారిపల్లికి చెందిన ఎన్ఆర్ఐ కాసు వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు నగదును మార్కాపురం డిప్యూటీ డిఇఒ మామిళ్ళపల్లి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం నగదు అందజేశారు. హెచ్ఎం నాగేశ్వరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 550 మార్కులు సాధించిన కె సాయిప్రియకు రూ.10వేలు, 528 మార్కులు సాధించిన ఎస్ దీప్తికి రూ.7500, 518 మార్కులు సాధించిన కె శ్వేతకు రూ.5 వేలు అందించారు. వెంకటేశ్వర్‌రెడ్డి ట్రస్ట్ సేవలు అభినంద నీయమని కొనియాడారు. పార్వతీపురం హెచ్ఎం స్థానికం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రస్టు సేవలను ప్రశంసించారు.

డీజే సౌండ్ బాక్సులు వాడరాదు

ప్రజాశక్తి-దర్శి

దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల పరిధిలో ఫంక్షన్లకు తిరునాళ్లకు ఏదైనా ఇతర కార్యక్రమాలకు డీజేలకు అనుమతి లేదని సిఐ వై రామారావు తెలిపారు. డీజే శబ్దాలకు చిన్నపిల్లలు, వృద్ధులు, గుండె జబ్బు సమస్యలు ఉన్నవారు చనిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. స్థానిక ఎస్ఐ ద్వారా సబ్ డివిజనల్ పోలీస్ అధికారికి పర్మిషన్ అప్లై ఉత్సవాలు చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా సౌండ్ బాక్స్‌లు పరిమిత సంఖ్యలో మాత్రమే వాడుతూ సౌండ్ మించ కుండా ఉండేలా చూసుకోవాలని అన్నారు. అలాకాకుండా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మత్తుపదార్థాలపై తనిఖీ

ప్రజాశక్తి-దర్శి

మాదక ద్రవ్యాలు, పేలుడు పదార్థాల నివారణ నేపథ్యంలో ఎస్‌పి హర్షవర్ధన రాజు ఆదేశాల మేరకు దర్శి డిఎస్పీ లక్ష్మీ నారాయణ పర్యవేక్షణలో మంగళవారం దర్శి టౌన్‌లోని వివిధ ప్రాంతాలలో ఒంగోలు నుండి వచ్చిన పోలీసు జాగిలంతో చెక్ చేశాయి. కార్యక్రమంలో దర్శి సిఐ రామారావు, ఎస్ఐ మురళి సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిని చూడలేకనే రాజీనామా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పంచాయతీలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నించిన పట్టించుకోని సర్పంచి, ఇఒ వైఖరికి నిరసనగా వార్డు సభ్యురాలు రాజీనామా చేసిన ఘటన భట్టిప్రోలులో చోటుచేసుకుంది. గడచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో ఎలాంటి బిల్లులు, ఓచర్లు లేకుండా సొమ్ము డ్రా చేయడమే కాక ఎక్కడ పని చేయకుండానే చేసినట్లు నమోదు చేసుకుని రూ.కోట్లు దండుకున్నారని వార్డు సభ్యురాలు కుక్కల శ్రీవల్లి ఆరోపించారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని అనేకమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. టిడిపి నాయకులు తూనుగుంట్ల సాయిబాబా పంచాయతీలో అవినీతి జరిగిందని గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి దానిపై సమీక్షలు, పరిశీలనలు జరిపారు. రూ.1.80 కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు నిర్ధారించారని ఆమె గుర్తు చేశారు. నిర్ధారణలో పొట్టకూటి కోసం వచ్చిన నలుగురు కార్యదర్శులు, ఇద్దరు గుమస్తాలు సస్పెండ్ అయ్యారని, దీనిలో భాగస్వామిగా ఉన్న సర్పంచిని కనీసం చెక్ పవర్ కూడా ఎందుకు తీయించలేదని ప్రశ్నించారు. దీనిలో సాయిబాబా, స్థానిక శాసన సభ్యులు ఆర్థిక లావాదేవీల కారణంగానే సర్పంచిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. సోమవారం జరిగిన పంచాయతీ సమావేశంలో ఎలాంటి పనులు జరగకుండానే రూ.3లక్షల విలువైన 50 ఓచర్ల సొమ్ము డ్రా చేసుకొని వోచర్లపై తీర్మానం చేయాలని కార్యదర్శి ప్రవేశపెట్టారని తెలిపారు. సర్పంచి, కార్యదర్శి సమావేశం నుండి బయటికి వెళ్లిపోయి గుమస్తాల ద్వారా రికార్డులు బయటికి తెప్పించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతిపై చర్యలు తీసుకోకపోవడంతో తన పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకొని ఎంపిడిఒకు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్నట్లు చెప్పారు.


రాజీనామా పత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు శ్రీవల్లి

అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి

ప్రజాశక్తి - పర్చూరు

అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిపి మేక ఆనంద్ కుమారి తెలిపారు. స్థానిక ఎంఆర్‌సి సమావేశ హాలులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజా సమస్యలపై స్పందించాలని చెప్పారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎఒ కె భాస్కరరావు మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరతేమీ లేదని చెప్పారు. రైతులు అవసరానికి మించి ఎరువులు నిల్వ చేయొద్దని సూచించారు. పొగాకు పంట పూర్తిగా ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. రైతులు సాగు చేయవద్దని చెప్పారు. పశు సంవర్ధక శాఖ డాక్టర్ అరుణ మాట్లాడుతూ పశు పోషకులు తమ పశువులకు గాలికుంటు టీకాలు వేయించుకోవాలని చెప్పారు. దానా అవసరమైన రైతులకు రాయితీపై అందజేస్తామని చెప్పారు. ఎంఈఓ ఒకటి శివ కోటేశ్వర రావు మాట్లాడుతూ బడికి ఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని చెప్పారు. ఎంపిడిఒ ప్రద్యుమ్న కుమార్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించి గ్రామాలు అభివృద్ధి చేయాలని చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పాలెటి వీరయ్య, కోట ప్రసన్న, డిప్యూటీ ఎంపిడిఒ కొసన సత్యనారాయణ, ఎఈ పిఆర్ శ్రీనివాసరావు, సిడిపిఒ జి సుభద్ర, హౌసింగ్ ఎఇ రామకృష్ణ, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ నాగరాజు, ఎంఈఓ 2 వెంకటరామయ్య, ఎపిఒ రమేష్ పాల్గొన్నారు.



వివిధ శాఖలపై సమీక్షిస్తున్న ఎంపిపి, ఎంపిడిఒ

జీఎస్టీ తగ్గింపు విద్యార్థులకు ప్రయోజనం

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

ప్రభుత్వం జీఎస్టీ పన్నుల స్లాబులు తగ్గించడం వల్ల విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. స్థానిక జడ్పీ హెచ్ఎస్‌లోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. నూతన జిఎస్టిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండలంలోని జెడ్పి హెచ్ఎస్‌లలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

వేటపాలెం : స్థానిక జెడ్‌పి బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు జిఎస్‌టి తగ్గింపుపై మంగళవారం అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉమ్మిటి వేణుగోపాలరావు, హెచ్ఎం దేవరకొండ సరోజిని, జడ్జిలుగా ఎ సుజాత, యు పద్మావతి, కెఎల్ఎన్ఎల్ ప్రసన్న, పి సునీత, ఎన్ రాంబాబు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : జీఎస్టీ తగ్గింపుపై స్థానిక రాయల్ హైస్కూల్లో విద్యార్థులకు కరస్పాండెంట్ పేరం రవీంద్రబాబు, కుడారి మధుబాబు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు నారాయణ, నాగేశ్వరరావు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. జీఎస్టీ ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఎంఈఓ వస్త్రాం నాయక్ పాల్గొన్నారు.

దర్శి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కామర్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రస్తుత సేవల పన్ను అనే అవగాహన కల్పించారు. జివి రత్నం వస్తు సేవల పన్ను వల్ల ప్రయోజనాలను వివరించారు. వ్యాసరచన పోటీ నిర్వహించారు. కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె ప్రభుదాస్ పాల్గొన్నారు.


మార్టూరులో మాట్లాడుతున్న పేరం రవీంద్రబాబు

కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షునిగా బాషా

ప్రజాశక్తి-దర్శి

కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా కురిచేడుకు చెందిన షేక్ పెద్దఖాదర్‌భాషను నియమిస్తూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కైపు వెంకటకృష్ణారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఇరిగినేని వెంకటనరసయ్య పాల్గొన్నారు.


నియామకపత్రం అందుకుంటున్న పెద్ద ఖాదర్ బాషా

కెజిబివిలో విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు కెజిబివి పాఠశాల్లోని 8, 9, 10 తరగతుల బాలికలకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు సిడిపిఒ డి సుధ తెలిపారు. పోషకాహారం గురించి నాలుగు టీముల మధ్య క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలకు జడ్జిలుగా సమగ్ర శిక్ష కౌన్సిలర్ వినోలియా, సునీత, సిడిపిఒ వ్యవహరించారు. గెలుపొందిన బాలికలకు ఎంఇఒ వి కోటేశ్వరరావు బహుమతులు అందజేశారు. ఎంఈఓ2 దినేష్ కుమార్, సూపర్ వైజర్ ప్రమీల పాల్గొన్నారు.

వైసీపీని బహిష్కరించాలి : ఆనందబాబు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అంబేద్కర్ విగ్రహాన్ని వైసీపీనే ధ్వంసం చేసి ప్రభుత్వం మీద బురద జల్లే ప్రయత్నం చేస్తుందని శాసన సభ్యులు నక్క ఆనందబాబు ఆరోపించారు. క్రూరత్వమే తప్ప మానవత్వం తెలియని నేతలు తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్నారని ఆరోపించారు. అంబేద్కర్ విగ్రహాన్ని నాశనం చేసిన వైసీపీ నేతలను బహిష్కరించాలని అన్నారు.

ఖాదర్ ఖాన్ సెంటర్‌కు బస్సులు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

చెరుకుపల్లిలో తెనాలి ఆర్టీసీ డిపో బస్సులు చెరుకుపల్లి ప్రారంభంలోనే వెనుతిరిగి వెళ్లిపోతున్నాయని ఖాదర్ ఖాన్ సెంటర్ వరకు నడపాలని కోరుతూ ఆ ప్రాంత ప్రజలు తెనాలి డిపో మేనేజర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఐలాండ్ సెంటర్ నుండి వెళుతున్నాయని తెలిపారు. బలుసులపాలెం, ఆరుంబాక, ప్రాంతాల నుండి తెనాలి వెళ్లే ప్రజలకు అనుకూలంగా ఖాదర్ ఖాన్ సెంటర్ వరకు నడపాలని కోరారు. కార్యక్రమంలో మర్రివాడ వెంకటరావు, గండే సాంబశివరావు, ఒరుగంటి వీరప్రసాద్, చింత క్రింద వెంకట సాంబశివరావు పేర్కొన్నారు.

పంట నమోదు రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి - చెరుకుపల్లి

పంట నమోదు వివరాల రికార్డులను రేపల్లె ఆర్డీఓ ఎన్ రామలక్ష్మి మంగళవారం పరిశీలించారు. పంట నమోదు గురించి నూతనంగా ప్రవేశపెట్టిన సూపర్ చెక్ విధానంలో ఆరుంబాక, గూడవల్లి గ్రామాల్లోని పంట నమోదు వివరాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దారు సిహెచ్ పద్మావతి, ఎఒ ఎండి ఫారూఖ్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

విద్యుత్తు షాక్ గురై వాటర్ ప్లాంట్ యజమాని మృతి చెందారు. స్థానిక పోలీసు స్టేషన్ ఎదురుగా రాజుగారిపాలెం వెళ్లే రోడ్డులోని యానాది కాలనీలో వాటర్ ప్లాంటులో విద్యుత్తు రాకపోవడంతో యజమాని రాంబాబు మరమ్మత్తులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ ప్రసరించడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మానసిక ఆరోగ్య దినోత్సవం

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

స్థానిక కెజిబివిలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ జె ప్రసాద్ పాఠశాలను సందర్శించి, విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులు ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంబించాలని సూచించారు.

చెరుకుపల్లి : యోగా ద్వారా ఆరోగ్యంగా ఉంటారని, ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా విద్యార్థుల్లో శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని కెరీర్ గైడెన్స్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ బిట్ర జయంతి పేర్కొన్నారు. ఎస్ఎస్ఎ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంధమహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పామూరు

పట్టణంలోని సిఎస్‌పురం రోడ్డులోని హజరత్ మహబూబ్ సుభాని గంధ మహోత్సవం దర్గా వద్ద పోస్టర్లు మంగళవారం ఆవిష్కరించారు. దర్గా కమిటీ ఉపాధ్యక్షులు షేక్ మీరా మోహిద్దీన్ మాట్లాడారు. కార్యక్రమంలో పులి ఖాసిం, షేక్ మీరా మొహిద్దీన్, కొడిగుంపల షేక్ నాయబ్ రసూల్, షేక్ హాజీ గౌస్, పత్తు మస్తాన్, షేక్ నాయబ, షేక్ గౌస్ బాషా, షేక్ గయాజ్, షేక్ మహబూబ్ పీరా పాల్గొన్నారు.

భూముల పరిశీలన

ప్రజాశక్తి - పామూరు

ఎప్పుడో అమ్ముకున్న భూములకు వారసత్వం పేరుతో ఆక్రమణకు గురవుతున్న వివాద భూములను తహశీల్దారు వాసుదేవరావు విచారణ చేపట్టారు. పట్టణంలోని పాత చెరువు ఆయకట్టు కింద సర్వే నెంబర్ 64/6 లో 1.09 సెంట్లు భూమిని కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల వారిని పిలిపించి గ్రామ ప్రజల సమక్షంలో వివరాలు తెలుసుకున్నారు. ఇరు వర్గాల వివరణ తీసుకొని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తప్పుడు అగ్రిమెంట్ సృష్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమానికి పాల్పడ్డ వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ అజయ్ కుమార్, విఆర్ఓ దినేష్, సర్వేయర్ సౌమ్య, గోపాలపురం ప్రజలు పాల్గొన్నారు.

కూరగాయల సాగుకు రాయితీలు

ప్రజాశక్తి - పంగులూరు

ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం ఎంతో సహకరిస్తుందని, రైతులు ఉద్యానవన పంటల సాగు వైపు దృష్టి సారించాలని అద్దంకి హార్టికల్చర్ అధికారి ఎస్ దీప్తి అన్నారు. హైబ్రిడ్ కూరగాయల సాగుకు హెక్టారుకు రూ.24 వేల సబ్సిడీ ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. మల్చింగ్ పేపర్ వేసుకొని ఉద్యానవన పంటలు సాగు చేస్తే రైతులకు హెక్టారుకు రూ.20వేలు సబ్సిడీ అందిస్తుందని చెప్పారు. పంగులూరు వచ్చిన ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. మొబైల్ ఆర్ స్టేటస్ వెల్డింగ్ కార్డులకు రూ.15 వేల సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. రిటైల్ మార్కెట్ ప్రాజెక్టు విలువ రూ.20 లక్షలు ఉండగా, దీన్ని చేసే రైతులకు రూ.7 లక్షలు సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. షేడ్ నెట్ నర్సరీని ఏర్పాటు చేసుకునే వారికి ఒక స్క్వేర్ మీటర్కు రూ.225 చొప్పున ఒక్కో రైతుకు సరాసరి 4 వేల స్క్వేర్ మీటర్ల వరకు సబ్సిడీ నిధులు అందిస్తుందని చెప్పారు.

సర్పంచి కృషితో పాఠశాల అభివృద్ధి

ప్రజాశక్తి - పిసిపల్లి

మండలంలోని వెంగళాయపల్లి ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ కరణం తిరుపతయ్య సహకరిస్తున్నట్లు హెచ్ఎం సర్వ రమణయ్య తెలిపారు. గతంలో ప్రహరీ గోడ లేక పాఠశాల ఆవరణలోనే పశువుల పేడ దిబ్బలు, గడ్డివాములు ఉండేవని తెలిపారు. తాను హెచ్ఎంగా విధుల్లో చేరిన తర్వాత గడ్డి వాములు, పేడ దిబ్బలు తొలగించారు. ప్రహరీ గోడ నిర్మాణానికి తన వంతు సహకరిస్తానని, పాఠశాల ఆవరణలో చదును చేసేందుకు జెసిబితో పనులు మంగళవారం ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించేందుకు ముందుకు వచ్చిన సర్పంచిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

10న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - నగరం

స్థానిక వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో ఈనెల 10న దివిస్ లాబొరేటరీస్‌లో ఉద్యోగార్థులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కరెస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి తెలిపారు. వివరాలకు పి అమరేష్‌రెడ్డిని 99634 65428,94946 09151 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులు

ప్రజాశక్తి - కారంచేడు

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యా రంగం అభివృద్ధి చెందిందని రాష్ట్ర ఎడ్యుకేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ తిరుమల శెట్టి శ్రీహరి తెలిపారు. మండలంలోని స్వర్ణలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతా ప్రమాణాలు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కీలకమైన పనులు అమలు చేస్తోందని చెప్పారు. పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. భవనాలు, తరగతి గదులు, సాంకేతిక పరికరాలు, డిజిటల్ క్లాస్ రూంలు వంటి ఆధునిక మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. విద్య నాణ్యతను పెంపొందించే దిశగా టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాంలు, మానిటరింగ్ వ్యవస్థలు, విద్యార్థుల ప్రతిభా అభివృద్ధిపై దృష్టి పెట్టినట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - పంగులూరు

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అధికారులు, నాయకులు తక్షణమే పరిష్కారం చేయాలని ఎంపిడిఒ కె స్వరూప రాణి కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు ముమ్మరం చేయాలని చెప్పారు. తాగునీటి సమస్య ఎక్కడ తలెత్తకుండా చూడాలని కోరారు. విష జ్వరాలు ప్రజలను బాధ పెడుతున్నాయని, అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి నిర్మూలించేందుకు కృషి చేయాలని అన్నారు. రెవెన్యూ అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని, రీ సర్వే పేరుతో భూములను గందరగోళం చేస్తున్నారని, దీనివలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అలవలపాడుకు చెందిన ఎంపిటిసి తెలిపారు. గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని తెలిపారు. తూర్పు కొప్పెరపాడులో ఒక వ్యక్తి అక్రమంగా స్థలం ఆక్రమించి గోడ నిర్మిస్తున్న రెవెన్యూ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామానికి చెందిన శ్రీనివాసరావు తెలిపారు. అక్కడికి వెళ్లి సమస్య పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్ఐ శ్వేత చెప్పారు. ఎంపిపి అధ్యక్షురాలు తేళ్ల నాగమ్మ, మండల ఉపాధ్యక్షులు యర్ర శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ స్వరూపరాణి

స్వచ్ఛభారత్ అవార్డులతో నూతనోత్సాహం

ప్రజాశక్తి - బల్లికురవ

అవనీర్ గ్రానైట్ ఫ్యాక్టరీకి స్వచ్ఛభారత్ అవార్డును ఆ ఫ్యాక్టరీ అధినేత చెరుకూరి అంజిబాబు కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ చేతుల మీదుగా బుధవారం అందుకున్నారు. ఫ్యాక్టరీ స్థాపించిన దగ్గర నుండి స్వచ్ఛతకు ప్రాధాన్యతనిస్తూ ఫ్యాక్టరీ చుట్టూ చెట్లు పెంచుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తు ఉండటంతో అవార్డుతో ఆయనను అభినందించారు. భారత సైన్యంలో పనిచేస్తున్నప్పుడు అలవాటు చేసుకున్నామని, గ్రానైట్ రంగంలో అడుగిడి రోటరీ ద్వారా తన వంతు సేవలందిస్తున్నట్లు తెలిపారు.

పర్చూరు : బాపట్లలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో పర్చూరు వైద్యశాలకు విశేష గౌరవం లభించింది. స్వచ్ఛత విభాగంలో అవార్డు విజేతగా ఎంపికైన నేపథ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్యకు కలెక్టర్ వినోద్ కుమార్ ప్రత్యేక అవార్డు అందజేశారు. ఆసుపత్రి పారిశుద్ధ్య ప్రమాణాలు మెరుగు పర్చడంలో సిబ్బంది కృషిని ప్రశంసించారు.

బాపట్ల : స్వచ్ఛ ఆంధ్ర జిల్లా స్థాయి అవార్డును కలెక్టర్ వినోద్ కుమార్ ద్వారా కమ్మ కళ్యాణ మండపంలో పట్టణ ఆజాద్ మునిసిపల్ మోడల్ ప్రైమరీ పాఠశాల హెచ్ఎం పురం వెంకట సాంబశివరావు అందుకున్నారు. 1953లో ఏర్పడి 72ఏళ్ల పూర్తి చేసుకుని నూరు శాతం పరిశుభ్రత, అత్యధిక విద్యార్థులను కలిగి ఉన్నట్లు తెలిపారు. పలువురు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న బల్లికురవ గ్రానైట్ అంజిబాబు

దర్శి : స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర అవార్డుల కార్యక్రమంలో భాగంగా పాఠశాల విభాగంలో జిల్లా స్థాయిలో చంద లూరు జెడ్పి ఉన్నత పాఠశాల అవార్డును పొందినది. అవార్డును కలెక్టర్ పి రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేతుల మీదుగా హెచ్ఎం గంధం గురుప్రసాద్ ఒంగోలులో స్వీకరించారు. ఎంపిడిఒ పి కల్పన, ఎంఇఒ కె రఘురామయ్య పాల్గొన్నారు.

బాపట్ల : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజా ఆరోగ్యం కాపాడటంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఆర్డీఓ పి గ్లోరియా అన్నారు. తూర్పు బాపట్ల గ్రామ సచివాలయంలో పారిశుధ్య కార్మికులైన క్లబ్ మిత్రులకు నూతన దుస్తులు, కొబ్బరినూనె, సబ్బులు వంటి రక్షణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దారు సలీమా, ఎంపిడిఒ బి బాబురావు, కల్లు గీత కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ తాతా జయప్రకాష్ నారాయణ, కార్యదర్శి పల్నాటి శ్రీరాములు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం

ప్రజాశక్తి - కనిగిరి

మండలంలోని తుమ్మగుంటలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మట్టి నమూనా పరీక్షలపై అవగాహన మంగళవారం కల్పించారు. ఒంగోలు భూ సారపరీక్ష కేంద్రం ఇంచార్జ్, ఎడిఎ ఎస్ సుచరిత మాట్లాడారు. మట్టి నమూనా పరీక్షలు ఆధారంగా ఎరువుల వాడకం ద్వారా పెట్టుబడి తగ్గించవచ్చని తెలిపారు. నీటి పరీక్షలు చేయించుకోవడం వలన కలిగే లాభాలు వివరించారు. వ్యవసాయ అధికారిని శైలజారాణి మాట్లాడుతూ జీవన ఎరువుల ప్రాముఖ్యత రైతులకు తెలిపారు. స్థానిక ఆదర్శ పాఠశాల్లో కళాశాల ప్రిన్సిపల్ టి పద్మావతి ఆధ్వర్యంలో సాయిల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు మట్టి నమూనాలు తీసే విధానం, మట్టి నమూనా సేకరణ ప్రాముఖ్యత వివరించారు. విద్యార్థుల చేత నమూనాలు సేకరణ చేయించారు. కార్యక్రమంలో ఎఇ ఎల్ మాల్యాద్రి, ఉపాధ్యాయులు రమేష్, రవి పాల్గొన్నారు.

నగరం : మండలంలోని అద్దంకివారిపాలెం రైతు సేవ కేంద్రంలో గుంటూరు ఆత్మ తరుపున వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వరి పంటలో సమర్థవంతమైన ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఎఒ వి రమేష్‌బాబు తెలిపారు. యూరియా కొరతపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మన గ్రోమోర్ మేనేజర్ ఎస్ కిషోర్ పాల్గొన్నారు.

ఇంటి వద్దనే కూరగాయల సాగు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రతి ఒక్కరూ ఇంటివద్దనే పండించుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ బి సంపూర్ణ సూచించారు. పలు గృహాల వద్ద అంగన్‌వాడీ లబ్ధిదారులు ఏర్పాటు చేసుకున్న పెరటి తోటలు, కిచెన్ గార్డెన్లను ఆమె మంగళవారం పరిశీలించారు. ఆకుకూరలు, కూరగాయలను పండించుకోవడం వలన కుటుంబానికి ఖర్చు తగ్గటమే కాక ఆరోగ్యవంతమైన ఉత్పత్తులు పొందవచ్చని అన్నారు. పోషణ పక్వాడ్ సందర్భంగా గర్భవతులు, బాలింతలకు సలహాలు సూచనలు ఇచ్చారు.

గర్భిణుల కోసం కిల్కారి సేవలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

గర్భిణి స్త్రీలు, బాలింతల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిల్కరి కాల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని రీజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ బి రాజు తెలిపారు. మార్టూరు, యద్దనపూడి, ద్రోణాదుల పిహెచ్‌సిల పరిధిలో ఆశా డేలో కిల్కారి కాల్ సేవలపై అవగాహన కల్పించారు. నెంబర్ 1600103 660 ద్వారా ఆరోగ్య సమాచారం ఫోన్‌లో అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఓ బేబీ, పిహెచ్ఎన్ విజయభారతి, సూపర్వైజర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ యాప్ పేరుతో టోకరా

ప్రజాశక్తి - కనిగిరి

ట్రేడింగ్ యాప్ పేరుతో పట్టణంలో ఘరానా మోసం చోటు చేసుకుంది. ట్రేడింగ్ యాప్లో డబ్బులు పెట్టి ఓ వ్యాపారి రూ.1.16 కోట్లు మోసపోయాడు. పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి ఫేస్‌బుక్‌లో ఓ మహిళ పరిచయమైంది. అనంతరం ట్రేడింగ్ యాప్లో డబ్బులు పెట్టాలని వ్యాపారికి ఆమె సూచించింది. ఆ మాటలు నమ్మి ఆయన రూ.1.16 కోట్లు యాప్లో పెట్టుబడిగా పెట్టాడు. ఆ డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యాపారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - చీరాల

ఒంగోలు రూడ్ సెట్ సంస్థ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ పి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అక్టోబర్ 21నుండి 31 రోజులపాటు శిక్షణ కొనసాగనుందని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని గ్రామీణ యువతీ, యువకులు శిక్షణకు అర్హులు అన్నారు. అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు కలిగి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువతీ, యువకులు 8309915577 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

ఇన్‌ఛార్జి తహశీల్దారుగా శ్రీచరణ్

ప్రజాశక్తి - పంగులూరు

ఇన్చార్జ్ తహశీల్దారుగా శ్రీ చరణ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత తహశీల్దారుగా పని చేస్తున్న పి సింగారావు వ్యక్తిగత సెలవులో ఉన్నారు. అద్దంకి తహశీల్దారుగా పనిచేస్తున్న జి శ్రీ చరణ్ ఇన్చార్జి తహశీల్దారుగా ఉన్నతాధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29వరకు బాధ్యతలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

9న ఖోఖో జట్టు ఎంపిక

ప్రజాశక్తి - పంగులూరు

స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల్లో ఈనెల 9న ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్- 19 బాలుర ఖో ఖో జట్టు ఎంపిక జరుగుతుందని ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ ఎం చింపారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు ఒరిజినల్, స్టడీ సర్టిఫికెట్లు, 10వ తరగతి ఒరిజినల్ మార్క్స్ లిస్టు తీసుకురావాలని తెలిపారు. 2007 జనవరి ఒకటి తరువాత పుట్టిన వారు అర్హులని తెలిపారు. విద్యార్థులు కళాశాల పిడి ఎం సీతారామిరెడ్డిని 98481 56652 ఫోన్ నెంబర్లో సంప్రదించాలని అన్నారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరిగే ఎస్‌జిఎఫ్ అండర్ 19 రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - పంగులూరు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, తల్లులు, గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారని, వీటిని ఉపయోగించుకొని మంచి ఆరోగ్యంతో పాటు పిల్లలకు చదువులు నేర్పించాలని నీతి ఆయోగ్ టీం సభ్యులు జోసఫ్ మిరాకిల్ అన్నారు. మండలంలోని రామకూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ముప్పవరం సెక్టర్ సూపర్వైజర్ పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్త టి తులసి, ఆయా పద్మ పాల్గొన్నారు.

దర్శి : ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం రామాలయం గుడి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. సూపర్‌వైజర్ సిహెచ్ సుభాషిని మాట్లాడుతూ తల్లులకు, గర్భవతులకు పోషకాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో ముండ్లమూరు, ఉల్లగల్లు సూపర్‌వైజర్లు ఇందిర, సునీత, ఎం సరస్వతి పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - నగరం

ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు మండలంలోని అద్దంకివారిపాలెంలోని జడ్పీ హైస్కూల్ నందు శక్తి టీం ఇన్చార్జ్, నగరం ఎస్ఐ భార్గవ్ విద్యార్థినీ, విద్యార్థులకు శక్తి యాప్, శక్తి టీమ్స్, గంజాయి నిర్మూలన, ఈగల్ టాస్క్ ఫోర్స్, ఫోక్సో చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజాబాబు, అధికారులు

వాల్మీకి మహర్షికి ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మానవాళికి రామాయణం లాంటి మహత్తరమైన గ్రంథాన్ని అందించిన మహానుభావుడు మహర్షి వాల్మీకి అని, వారి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు పోవాలని కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు జిల్లా బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. తొలుత కలెక్టర్ రాజాబాబు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి నేడు యావత్ ప్రపంచానికే ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మలా జ్యోతి, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వర రావు, పలు బిసి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న అధికారులు

బాపట్ల జిల్లా : మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్లో వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ వినోద్ కుమార్ నివాళులర్పించారు. వాల్మీకి చేసిన కృషి మన జీవితానికి స్ఫూర్తిదాయకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, ఆర్డీఓ పి.గ్లోరియా, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారిణి శివలీల, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ ఉమామహేశ్వర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి పొందిన రామాయణ మహాకావ్యాన్ని రచించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి. సిఐ జి.నారాయణ, అడ్మిన్ ఆర్.ఐ. షేక్ మౌలుద్దీన్ పాల్గొన్నారు.

గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న పాశవిక దాడులు తక్షణమే నిలిపివేయాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. గాజాపై దాడులు ప్రారంభమై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం నాడు ఒంగోలు సుందరయ్య భవన్‌లో సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్), సిపిఎం(ఎల్) న్యూ డెమొక్రసీ పార్టీల సంయుక్త సమావేశం నిర్వహించారు. సమావేశంలో నేతలు మాట్లాడుతూ గత రెండేళ్లగా ఇజ్రాయిల్ గాజాపై నరమేధం సృష్టిస్తూ, పసిపిల్లలు, మహిళలు, వృద్ధులను విచక్షణారహితంగా హతమారుస్తోందన్నారు. అమెరికా అండతో ఇజ్రాయిల్ నేరానికి తెరలేపిందని, ఆసుపత్రులు, పాఠశాలలు, నిర్వాసితుల శిబిరాలు బాంబుల



సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీల నేతలు

వర్షంలో మునిగిపోయి మానవతా విలువలు మంటగలిసాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ క్రూరత్వం వెనుక అమెరికా సామ్రాజ్యవాదం ఉందన్నారు. గాజా ప్రజలకు ఐక్యత ప్రకటిస్తూ, అక్టోబర్ 21న అద్దంకి బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ శాంతి ప్రదర్శన నిర్వహించాలని తీర్మానం చేశారు. తొలుత గాజా యుద్ధంలో మరణించిన ప్రజలకు సమావేశం శ్రద్ధాంజలి ఘటించింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్.కె.మాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ, సిపిఐ(ఎంఎల్) జిల్లా నాయకులు ఎం.ఎస్. సాయి, సిపిఎం(ఎల్) న్యూ డెమొక్రసీ నాయకులు ఆర్.మోహన్, సిపిఎం నాయకులు జి.వి. కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, సిపిఐ(ఎంఎల్) నాయకుడు పరిటాల కోటేశ్వరరావు, ఎం.ఎల్. న్యూ డెమొక్రసీ నాయకులు జాలయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరువయ్యే విధంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ వీక్షణ సమావేశ మందిరంలో మైనారిటీ సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మైనారిటీల సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో 2011 జనాభా గణాంకాల ప్రకారం మొత్తం 1,21,847 మంది మైనారిటీలు ఉన్నారని, మైనార్టీ విద్యార్థిని విద్యార్థులకు విద్యోన్నతి కోసం ట్యూషన్, మెయింటెనెన్స్ ఫీజు కింద పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ అందించబడుతుందని కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఆదర్శ గ్రామాలుగా ఎంపికైన గ్రామాల వివరాలపై సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని ఆరా తీశారు. ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి పార్థసారథి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శివలీల తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పనులను వేగవంతం చేయాలి

జిల్లాలో జరుగుతున్న స్వామిత్వ సర్వే పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. పంచాయతీ, మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యక్రమాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం ఆయన వీక్షణ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 205 గ్రామాలలో స్వామిత్వ సర్వే జరుగుతుండగా, పురోగతి కనిపించకపోవడంపై ఆరా తీశారు. గ్రామాలలో సర్వే మరింత వేగం పెంచాలన్నారు. 45 గ్రామాలలో సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. ఆ మేరకు వేగంగా సర్వే చేపట్టాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణ నిబంధనల ప్రకారం చేపట్టాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, డిపిఓ ప్రభాకర్, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ అనంతరాజు,ఆర్‌డివో పి గ్లోరియా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులతో 'ఏఎంఆర్' చర్చలు

ప్రజాశక్తి-చీమకుర్తి



గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల, క్వారీ యజమానులతో చర్చలు జరుపుతున్న ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు

గత వారం రోజులుగా గెలాక్సీ గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ సంయుక్త సంఘాల ఆధ్వర్యంలో గ్రానైట్ ఫ్యాక్టరీలు మూత వేసి సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. గ్రానైట్ సీనరేజ్ వసూలు ఏఎంఆర్ ప్రైవేట్ సంస్థకు అప్పగించిన నేపథ్యంలో ఫ్యాక్టరీ యజమానులు సమ్మె చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులకు గ్రానైట్ క్వారీ యజమానులు మరియు ఫ్యాక్టరీ యజమానులకు చర్చలు మంగళవారం ఒంగోలులోని అసోసియేషన్ హాల్లో జరిగాయి. గతంలో రెండుసార్లు చర్చలు జరిగినా ఎలాంటి ఫలితం లేదు. మంగళవారం జరిగిన చర్చలు కూడా అర్ధాంతరంగానే ముగిశాయి. ఫ్యాక్టరీ యజమానులు రూ.27 వేలు ప్రభుత్వం పెంచిన మరో రూ.8 వేలు మొత్తం కలిపి రూ.35 వేలు మాత్రమే చెల్లిస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తమ సంస్థ యాజమాన్యానికి తెలియపరచి తగు నిర్ణయం తీసుకుంటామని ఏఎంఆర్ ప్రతినిధులు నిహంత్ తెలిపారు. దీంతో చర్చలు మరో దఫా జరిగే అవకాశం ఉంది. మరో వైపు గ్రానైట్ ఫ్యాక్టరీలు పూర్తిస్థాయిలో మూత వేసి యజమానులు సమ్మె కొనసాగుతోంది. కార్యక్రమంలో క్వారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు చలువాది బదరీ నారాయణ, ఆర్‌పి రవి, సిద్ధ భరత్, భాస్కర్ రెడ్డి, శిల్పా, ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు మార్వెల్ బుజ్జి, కాట్రగడ్డ రమణయ్య, ఎర్రగుంట్ల శ్రీనివాసరావు, లగడపాటి శ్రీనివాసరావు, మలినేని వెంకటేశ్వర్లు, సిహెచ్ మస్తాన్ రెడ్డి, బివిఎల్ వెంకటరావు, పంగులూరు సురేష్, సుబ్బారావు, ఆనంద్ గ్రానైట్స్ ప్రతినిధి కృష్ణ, నూనె వంశీకృష్ణ, నూనె అనుదీప్, ఆర్ లక్ష్మీనారాయణ, చలపతిరావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ స్థలంపై ప్రైవేట్ పెత్తనం తగదు

వామపక్ష నేతల పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



ధర్నాలో మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

ఒంగోలు నగరంలో ఉన్న పాత మార్కెట్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ (పీపీపీ) విధానంలో అప్పగించే నిర్ణయాన్ని రద్దు చేయాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రభుత్వానికి చెందిన కోట్లాది రూపాయలువిలువైన ఆస్తిని ప్రైవేటు వ్యక్తుల లాభాల కోసం వదులుకోవడం ప్రజా ప్రయోజనాలకు తిలోదకాలు ఇవ్వడేనని పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంకు సంస్కరణల పేరుతో పట్టణ భూములను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే విధానాన్ని వారు తీవ్రంగా విమర్శించారు. గత 15 ఏళ్లుగా ఖాళీగా ఉన్న పాత మార్కెట్ స్థలాన్ని, ఎలాంటి చర్చ లేకుండా, గత నెల 12వ తేదీన అత్యవసర కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి, కేవలం ఐదు రోజుల్లో టెండర్లు పిలవడం వెనుక ఏ శక్తులు ఉన్నాయో ప్రకటించాలని నేతలు డిమాండ్ చేశారు. ఒంగోలు నగర నడి బొడ్డులో ఉన్న ఈ 83 సెంట్ల విలువైన స్థలంలో నగరపాలక సంస్థే స్వయంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు జి.రమేష్, తంబి శ్రీనివాసులు, టి. మహేష్, సయ్యద్ హుస్సేన్, బి.వి.రావు, నగర అభివృద్ధి కమిటీ నాయకులు మారెళ్ల సుబ్బారావు, టి. భక్త సింగ్ రాజు, సిపిఐ నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు, కారుమూడి నాగేశ్వరరావు, సూదనగుంట శ్రీనివాసరావు, కోనూరి వెంకటేశ్వర్లు, నూనె మోహన్ రావు, ఏ.వై.రెడ్డి, సుందరం, కల్లూరు లక్ష్మయ్య, సిద్దయ్య, మన్యం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏఎంసి చైర్మన్ 'రాచగర్ల' ప్రమాణ స్వీకారం

హాజరు కానున్న రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు

ఒంగోలులో భారీ ర్యాలీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ప్రతిష్టాత్మకమైన ఒంగోలు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రాచగర్ల వెంకట్రావు, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అంతా సిద్ధమైంది. బుధవారం సాయంత్రం 4 గంటలకు ఒంగోలు ఏ1 కన్వెన్షన్ హాలులో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు పాల్గొననున్నారు. ఏఎంసి చైర్మన్ రాచగర్ల వెంకట్రావుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన అభిమానులు, టిడిపి నేతలు ఒంగోలు నగరంలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రాచగర్ల వెంకట్రావు, వైస్ చైర్మన్‌గా చిట్టెం వెంకట దుర్గా ప్రసాద్, 14 మంది సభ్యులు ప్రమాణం చేయనున్నారు. బుధవారం జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఒంగోలు ఏ1 కన్వెన్షన్ హాలు వేదిక కానుంది. ఏఎంసి చైర్మన్‌గా ఎన్నికైన రాచగర్ల వెంకట్రావు మొదట్లో కాంగ్రెస్ పార్టీలో పనిచేశారు. టంగుటూరు మండలం సిరిపురం సర్పంచ్‌గా విశేష సేవలు అందించారు. అప్పటి నుంచి రాచగర్ల వెంకట్రావును సిరిపురం వెంకట్రావు పిలుస్తుంటారు. 2014 నుంచి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక నాయకునిగా, పార్టీ విధేయునిగా ఏ పని అప్పగించినా శక్తివంచన లేకుండా పనిచేశారు. 2014, 2024 ఎన్నికలలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు గెలుపుకు అహర్నిశలు శ్రమించారు. దీంతో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు రాచగర్ల వెంకట్రావును ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సిఫారసు చేసి పదవి వచ్చేలా కృషి చేశారు.

హాజరు కానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ఏఎంసి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రాష్ట్ర సాంఘిక సంక్షేమం, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు పాల్గొననున్నారు. ఒంగోలు మినీ స్టేడియం నుంచి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగే ఏ1 కన్వెన్షన్ హాలు వరకు కూటమి నేతలు భారీ బైక్ ర్యాలీ చేపట్టనున్నారు.

ప్రమాణ స్వీకారాన్ని జయప్రదం చేయండి

- ఏఎంసి చైర్మన్ రాచగర్ల వెంకట్రావు



ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చైర్మన్ రాచగర్ల వెంకట్రావు కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీని మరింత అభివృద్ధి చేస్తామన్నారు ఒంగోలు ఏ1 కన్వెన్షన్ హాలులో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.